# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పాఠశాల విద్యాశాఖ ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా 45 వేల 94 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించింది.**

2. **విద్యారంగానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు.**

3. **రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్యార్హతలున్న ఉపాధ్యాయులు ఉన్నారని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ వెల్లడించారు.**

4. **కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ సహకారంతో రాష్ట్రప్రభుత్వం కృష్ణాజిల్లా పోరంకిలో 'ఊర్జావీర్' కార్యక్రమాన్ని ఈ రోజు ప్రారంభించనుంది.**

5. **ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దర్యాప్తు బృందం.. సిట్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

==========================

విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు – ఉపాధ్యాయులతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 45 వేల 94 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం విద్యార్థులతో ముఖ్యమంత్రి ముచ్చటించడంతో పాటు వారి ప్రగతి నివేదికలు పరిశీలించారు. ఆ తర్వాత తల్లిదండ్రులు, పూర్వవిద్యార్థుల సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ విద్యాబోధనతో పాటు, విద్యార్థులకు ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాశానికి సంబంధించిన అంశాలనూ బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బలవర్ధకమైన ఆహారాన్ని విద్యార్థులకు అందజేయాలని చంద్రబాబునాయుడు తెలియజేస్తూ...

వాయిస్ ( 31 సెకన్స్)

అనంతరం విద్యార్థులతో కలిసి వారు సహపంక్తి భోజనం చేశారు. మరోవైపు కడపలోని పురపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

---

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్యార్హతలు గల ఉపాధ్యాయులు ఉన్నారని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నవాబుపేటలోని బీవీఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ రోజు నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఒకే రోజు, ఒకే సమయంలో 45 వేల పాఠశాలల్లో ఈ సమావేశాలు నిర్వహించడంపై హర్షం వ్యక్తంచేశారు. పదవ తరగతిలో గ్రేస్ మార్కులతో పాసైన తాను.. డిగ్రీ, పీజీలో గోల్డ్ మెడల్ సాధించడానికి గురువులే కారణమని ఆయన తెలిపారు. తరచుగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో గొప్ప మార్పు వస్తుందని మంత్రి నారాయణ వివరిస్తూ...

వాయిస్ (28 సెకన్స్)

---

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్.. ఈఈఎస్ఎల్ సహకారంతో రాష్ట్రప్రభుత్వం 'ఊర్జావీర్' కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇంధన-సామర్థ్య ఉపకరణాలను ప్రోత్సహించడానికి, విక్రయించడానికి, ఆర్థికాభివృద్ధితో పాటు శక్తి, పర్యావరణ పరిరక్షణకు ఈ కార్యక్రమం దోహదపడుతుంది. కృష్ణా జిల్లా పోరంకిలో ఈ రోజు ఊర్జావీర్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానుండగా, కేంద్ర ఇంధన శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ప్రత్యేక అతిథిగా హాజరవుతారు. ఊర్జవీర్‌లో భాగంగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌లకు ఎలక్ట్రికల్ ఉపకరణాల్లో ఇంధన సామర్థ్యంపై శిక్షణ ఇవ్వనున్నారు.

---

రాష్ట్రంలో ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దర్యాప్తు బృందం.. సిట్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరుగురు సభ్యులతో కూడిన సిట్‌కు సీఐడీ ఇన్స్‌పెక్టర్ జనరల్ వినీత్ బ్రిజ్‌లాల్ నేతృత్వం వహిస్తారు. ప్రతి 15 రోజులకోసారి కేసు పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించిన ప్రభుత్వం.. సిట్‌కు పూర్తి స్థాయి అధికారాలు అప్పగించింది. ప్రజాపంపిణీ బియ్యం అక్రమ రవాణాపై కాకినాడలో 13 కేసులు నమోదయ్యాయి. వీటి దర్యాప్తు బాధ్యతలను ఇప్పుడు ప్రభుత్వం సిట్‌కు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు.

---

దేశ రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సాయుధ దళాల సేవలు ...., త్యాగాలను స్మరించుకునే ఉద్దేశ్యంతో ఈరోజు సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1949 ఆగస్టు 28వ తేదీన రక్షణ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ఏటా డిసెంబర్ 7వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా దేశ ప్రజల నుండి విరాళాలు సేకరించి.... తద్వారా సమకూరిన మొత్తాన్ని యుద్ధంలో గాయపడిన వారికి పునరావాసం కల్పించడానికి ...., ప్రస్తుతం సర్వీసులో వున్న సిబ్బందికి ...., మాజీ సైనికోద్యోగుల కుటుంబాల సంక్షేమానికి అందజేస్తారు.

---

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని వారి సంక్షేమానికి మనందరం కలిసికట్టుగా కృషి చేయాలని ప్రకాశం

జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. సైనికదళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో పతాక నిధికి ఆమె విరాళం అందించారు. మాజీ సైనికులకు జ్ఞాపికలను బహుకరించారు. ఈ సందర్భంగా జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి ఎం.రజనీ కుమారి మాట్లాడుతూ.. ఏటా మాజీ సైనికుల సంక్షేమానికి పతాక నిధి పేరిట విరాళాలు సేకరిస్తామని తెలిపారు. పతాక నిధి ద్వారా సేకరించిన విరాళాలను మాజీ సైనికుల సంక్షేమానికి వినియోగిస్తారని చెప్పారు. ప్రజలు విరివిగా విరాళాలు అందించాలని రజనీ కుమారి విజ్ఞప్తి చేస్తూ...

వాయిస్ (30 సెకన్స్ )

---------------------------

దేశా రక్షణలో ప్రాణాలు కూడా లెక్కచేయకుండా పోరాడుతున్న సాయుధ దళాల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దిన్‌కర్ పుండ్కర్ తెలపారు. శ్రీకాకుళం నగరంలో సాయుధ దళం జెండా దినోత్సవం సందర్భంగా ఈ రోజు ఏర్పాటు చేసిన పతాక నిధికి ఆయన విరాళం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత సైనిక దళాలకు కృతజ్ఞతలు తెలిపేందుకు, దేశానికి సేవ చేస్తూ వీర మరణం పొందిన వారిని స్మరించికొనేందుకు ఈ సాయుధ దళాల పతాక దినోత్సవం జరుపుకొంటున్నామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి ఎ.శైలజ మాట్లాడుతూ.. మాజీ సైనికుల కుటుంబ సభ్యులు, వారి పిల్లల సహాయార్థం ఈ విరాళాలు సేకరిస్తున్నామని చెప్పారు.

---------------------------

ఆగ్నేయ బంగాళాఖాతంతో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ రోజు దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించే క్రమంలో బలపడుతూ ఈ నెల 12వ తేదీ నాటికి తమిళనాడు, శ్రీలంక తీరాల దిశగా వస్తుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది. దీని ప్రభావంతో ఈ నెల 11వ తేదీ నుంచి రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో వర్షాలు పెరుగుతాయని, 12వ తేదీ అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. రాబోయే 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

======================